

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 11 మే, 2015 సంచిక : 12

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

వార్షిక చందా .......... రూ॥ 80/-

ఆజీవ సభ్యత్వం .......... రూ॥ 800/-

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2

శారదామాత-మాతా పితరులు ...... 6

అనుభవాలు-అనుభూతు .......... 9

గజానన విజయం .......... 15

షిరిడీ డైరీ .......... 19

మనిషెంత నీచుడో .......... 22

మంగళాశీస్సులు .......... 23

శుకవాణి .......... 25

మాతృసంస్థ కబుర్లు .......... 26

వివాహ వ్యవస్థ .......... 28

స్వరాంజలి .......... 31

ఆంజనేయా - నమోస్తుతే .......... 32

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com







## మా వాణి



శ్రీ సాయినాథుల వారు పదేపదే ఒక మాట చెప్తూ ఉండేవారు- 'మన కర్మకు మనమే బాధ్యులం' అని. "అవి యీ జన్మలో తప్పించుకున్నా ఆ కర్మఫలాలు తరువాతనైనా అనుభవించక తప్పదు". ఈ భావం సచ్చరిత్రలో చాలాచోట్ల కనిపిస్తుంది.

కపర్దే భార్య సాయిబాబా దగ్గరకు వచ్చింది. సాయి కోసం భోజనం తెచ్చింది. అంతవరకు సాయి ఏ పదార్థమూ ముట్టకుండా కూర్చున్నారు. ఆమె రాగానే చాలా ఆత్రంగా ఆమె తెచ్చిన పదార్థాలు తినసాగారు. "ఇతరులు తెచ్చినవి ముట్టవు-ఇవెందుకింత ఆతురతతో తింటున్నావు?" అని శ్యామా అడిగాడు. అప్పుడు బాబా ఆమె తన గత జన్మలలో తన కర్తవ్య కర్మలను ఎంత చక్కగా నిర్వహించిందో, ఆ పుణ్యఫలం వలన ఆమెకు ఉత్తరోత్తర జన్మలు (మొదట ఆవుగా-తదుపరి తోటమాలి బిడ్డగా-అటుపైన క్షత్రియుని యింట-అప్పుడు బ్రాహ్మణుని యింట) మెరుగైనవిగా ఎలా వచ్చాయో వివరించారు. అందుకే ప్రేమయుతమైన ఆమె ఆహారం నుండి సంతోషంగా తింటున్నానని చెప్పారు. మన కర్తవ్యాలను శ్రద్ధతో, దోషరహితంగా నిర్వర్తించినపుడు మంచి జన్మలు రావటమేకాక భగవంతునికి కూడా చేరువవుతాము.

మనకు కష్టసుఖాలనేవి మనం చేసిన పాపపుణ్యాలకు ఫలితాలుగానే వస్తాయి. సుఖాలు కలిగినపుడు మనం ఆనందిస్తామే తప్ప మన పుణ్యం ఖర్చైపోతున్నదని బాధపడం. కష్టాలు వచ్చినపుడు విచారిస్తామే తప్ప-మన పాపం కొంత ఖర్చైపోతున్నదని ఆనందించం. అంటే మనం తలక్రిందులుగా

ఆలోచిస్తున్నామన్నమాట! ఒక్కొక్కసారి కొందరు యీ బాధలు భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటూ ఉంటారు కూడా. రైతులు, సాలెవారు, మైక్రో ఫైనాన్స్ అప్పలు తీర్చలేనివారు-యింకా -అప్పల బాధలతో, భయంతో, ఏం చెయ్యాలో తోచని యిరుకునబడిన వారు- తమ ప్రాణాలు తామే తీసుకొంటుం టారు. ఇవికాక పరీక్షల్లో తప్పామనీ, ప్రేమ విఫలమైందనీ చచ్చే మూఢులు కూడా ఉన్నారు. చివరికొకావిడ మరణం గురించి తరచి చూస్తే-వాళ్లాయన తనకు బంగారు గాజులు చేయించలేదని అలిగి ఉరిపెట్టుకున్నదని తేలింది.

ఎన్నో లక్షల జన్మల తరువాత వచ్చే అమూల్యవరం మానవజన్మ. అలాంటి జన్మను ఎతో చక్కగా ఉపయోగించుకోగలగాలి. పైగా జీవితం అంటే ఏమిటి? కేవలం చదువా? లేక కెరీరా? కాక-పెళ్లా? ప్రేమా? డబ్బా, సుఖాలా? వీటిలో ఏ ఒక్కటీ సమగ్ర జీవనం కాదు. బాల్యం, చదువు, కెరీర్-ఇవన్నీ కలిపి ఒక భాగం, ప్రేమ(?) పెళ్లి, సంసారం, పిల్లా మేకా-ఇదంతా కలిసి ఒక భాగం, సమాజంతో నీవెలా ప్రవర్తిస్తున్నావు, సమాజానికి నీవేం చేస్తున్నావు? - ఇదంతా మూడవ భాగం, భగవంతునితో నీ బంధం ఎలా ఉంది, నీ ఆత్మోన్నత్యం కోసం ఏం చేస్తున్నావు? - ఇదంతా నాల్గవ భాగం. వీటన్నిటి సమాహార స్వరూపమే మానవజీవితం. ఇందులో ఏదో ఒక్క భాగం- అందులోనూ ఒక చిన్న విభాగం నశించిపోయిందని మొత్తం జీవితమంతా నాశనం చేసుకోవటం మూర్ఖత్వం. దీనికి కారణాలు అనేకం ఉన్నాయి. మొట్టమొదటిది-జీవితంలో ఆటుపోట్లు సహజమనీ, వాటిని తట్టుకోవటమే మనిషి కర్తవ్యమనీ, ఇవి మన కర్మఫలంగానే వస్తాయి గనుక స్వీకరించక తప్పదనీ అత్యంత సహజంగా పెద్దల మాటల ద్వారాగానీ, చుట్టూ ఉన్న వారి జీవితాలను పరిశీలించిన అనుభవజ్ఞానం ద్వారాగానీ గ్రహించలేకపోవటం. రెండవది-తాహతుకు మించిన కోరికలు కోరుకొని, దేనికోసమో పగటి కలలు కని చివరకు భగ్నజీవనులైపోవటం.





మూడవది- ఇవ్వేళ మన పాఠశాలలు నేర్పే విద్య మనోస్థైర్యాన్నీ, నిరాడంబరతనూ, జీవితం పట్ల ప్రేమనూ నేర్పేది కాకపోవటం. ఇక నాలుగవది-మానవ జీవితం యొక్క విశిష్టతను, ఘనతను బాల్యం నుండీ గ్రహించగలిగే విధంగా (గత కాలంలోలాగా) మన కుటుంబ, విద్యా వాతావరణం లేకపోవటం.

ఈ అన్ని కారణాల ఫలితం ఏమిటంటే "ఛస్తే పోయె!" అనే మనస్తత్వం పెరుగుతూ పోవటం. శ్రీ సాయిబాబావారి చరిత్రలో అంబాడేకర్ కథ ఉన్నది. అతడు ఏవో బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలను కొన్నాడు. (అది కూడా షిరిడీలో). అతని మనసులోకి ఆ భావన రాగానే చేరువలో ఉన్న హొటలు యజమాని సగుణమేరు నాయక్ అనే అతడు అంబాడేకర్‌ను పిలిచి అక్కల్‌కోట మహారాజు చరిత్ర యిచ్చి చదవ మన్నాడు. ఇతను పుస్తకం తెరిచేసరికి చావడానికి బావిలో పడిన ఒక భక్తుడిని బయటకు తీసి మహరాజు "గత జన్మ పాపపుణ్యాలు నీవు అనుభవించక తప్పదు. కర్మానుభవం పూర్తి కాకుండా నీవు ఆత్మహత్య చేసుకుంటే యీ దోషాలు మరో జన్మలోనైనా అనుభవించక తప్పదు. అవేవో యిప్పడే అనుభవిస్తే తుడుచుకుపోతాయి గదా!" అని బోధించి, అతనిని ఓదార్చి యింటికి పంపిన కథ వచ్చింది. దానితో అంబాడేకర్ మనసులో ఆలోచన ప్రారంభమైంది. జీవితేచ్ఛ తిరిగి వచ్చింది. మూఢత్వం నుంచీ బయటపడ్డాడు.

ఒకడి జేబులో ఒక రూపాయ-నాలుగు పావలాల రూపంలో ఉంది. ఒక పావలా ఎక్కడో పడిపోయింది. "ఛీ! ఇంకెందుకీ డబ్బు!" అని నిరాశ చెందో, ఉద్రిక్తపడో మిగిలిన మూడు పావలాలూ రోడ్డు మీదికి విసిరేస్తే-వాడినేమంటాం? పిచ్చి సన్నాసి! అంటాం. లేని దాన్ని తలచుకొని విచారించి, ఉన్న దాన్ని కూడా పోగొట్టుకునే వారినేమనాలి? ఆలోచించండి. మన ప్రారబ్ధాలే మనకు బాధలను తెచ్చేవి. అవి ఎలాగూ

తప్పవు. స్థైర్యంగా నిలవడమే ధీరత్వం.

ఒక స్త్రీని నేనొకప్పుడు ఒక ప్రశ్న వేసాను. ఆమె భర్త చాలా కోపిష్టి. ఆమెను ఉత్తిపుణ్యానికే చెడదిట్టేవాడు. వినేవాళ్లకే ఒళ్లు మండిపోతుంది ఆ తిట్లకు. ఆ తల్లి మాత్రం పల్లెత్తి మాట్లాడేది కాదు. ముగ్గురు పిల్లల తల్లి అయినా అదే పరిస్థితి. పోనీ, ఆమె ఏమైనా కొంటె పనులు చేస్తుందా? లేదు. చాలా భయభక్తులతో "ఉత్తమ యిల్లాలు" అనిపించుకొన్నది. ఇదంతా చూచి నేనడిగానోరోజు-"మీకెప్పడూ ఆత్మహత్య చేసుకోవాలనిపించ లేదా?" అని. ఎందుకన్నదామె. "వినే వాళ్లకు మాకే గుండెలు మండిపోతు న్నట్లుంటాయి మీ వారి మాటలకు. మీరెలా భరిస్తున్నారు? అందుకే అడుగుతున్నాను" - అన్నాను.

"అమ్మా, మా ఆయన ఊళ్లో అందరికీ మంచివాడే. నన్ను చూస్తేనే చిరచిరలాడతారు. పోనీ వేరే అలవాట్లేమైనా ఉన్నాయా అంటే లేవు. నా ప్రారబ్ధం అలా ఉంది-అనుభవిస్తున్నా. ఇప్పడు యీ శరీరాన్ని అంతం చేసినా మరో తనువెత్తాకనైనా యిది అనుభవించక తప్పదు. పైగా ఉన్న ఆనందాలను అనుభవించక, లేని దాని కోసం విచారమెందుకు నాకు? నా పిల్లలు రత్నాలు. నా భర్తను అందరూ మెచ్చుకొంటుంటారు. గ్రాస వాసో దైన్యం లేదు నాకు. చాలదామ్మా హాయిగా బ్రతకడానికి!" అన్నది. నాలుగో ఐదో చదివి మానేసిన ఆ తల్లికున్న వివేచన, సహనం మన సోకాల్డ్ విద్యావంతులకెందుకుండదా- అనిపిస్తుంది నాకు.

గతంలో కూడా ప్రతి వాళ్లకూ ఏవో కష్టాలు తప్పేవి కావు. అలా వచ్చి నపుడు ఒకరికొకరు సహకరించుకోవటం, ఓదార్చుకోవటం, విడమరచి చర్చించుకోవటం ద్వారా మనోధైర్యం తెచ్చుకొనే వారు. ఇప్పడో-ఎవరికి వారే యమునాతీరే. అందుకే మన గతి యీ తీరు. మార్చుకుందామా?





# శారదామాత–మాతా పితరులు

**- శ్రీ శారదాదేవి చరితామృతం నుండి**

ఒకసారి లక్ష్మీ, శివరాం మరికొందరితో మాతృదేవి కామార్పుకూర్ నుండి దక్షిణేశ్వరానికి బయలుదేరారు. అందరూ ఆరాంబాగ్ చేరుకున్నారు. ఇంకా రాత్రి కాలేదు. అంతలోపునే తేలో భేలో మైదానాన్ని దాటి వెళ్లిపోవచ్చు నని వారు రాత్రికి అక్కడ బస చేయకుండా ముందుకుసాగారు. నడచి నడచి మాతృదేవి బాగా అలసిపోయారు. అయినా ఆగకుండా నడుస్తూనే ఉన్నారు. నాలుగు మైళ్లు నడిచిన తర్వాత, ఇక నడవలేక వెనుకబడి పోయారు. ఆమె వెంట వచ్చినవారు కాసేపు వేచివుండి మాతృదేవి తమను చేరుకోగానే త్వరగా నడవమని చెప్పి ముందుకు వెళ్లిపోయారు. ఆ మైదానం మధ్యకు చేరుకునేసరికి మాతృదేవి బాగా వెనుకబడిపోయారు. దాంతో వారందరూ మళ్లీ మాతృదేవి కోసం వేచి ఉండి ఆమె వచ్చిన వెంటనే "ఇంత నిదానంగా నడిస్తే చీకటి పడకముందే యీ మైదానాన్ని దాటలేం. అందరూ బందిపోట్ల వాతబడవలసిందే" అన్నారు. వారిలో అసందిగ్ధత, భయమూ కలగడానికి తాము కారణమయ్యామని గ్రహించిన మాతృదేవి వారితో తమ కోసం వేచివుండవద్దని చెప్పి "మీరందరూ తిన్నగా తారకేశ్వరం వెళ్లి విశ్రాంతి తీసుకోండి. వీలయినంత త్వరలో నేను మిమ్మల్ని కలుసుకుంటాను" అని అన్నారు. సమయం గడిచిపోతూ ఉండటంతో వారంతా మాతృదేవి సలహా మేరకు వేగంగా ముందుకు నడవసాగారు. కాసేపటికల్లా వారు మాతృదేవికి కనుమరుగైపోయారు.

మాతృదేవి వీలయినంత వేగంగా నడిచినా కూడా అలసట కారణంగా బాగా వెనుకబడిపోయారు. మైదానం మధ్య భాగం చేరుకున్న కాసేపట్లోనే చీకటిపడసాగింది. ఆమె ఏం చేయాలో పాలుబోక మధనపడుతున్నప్పడు ఒక నల్లటి దృఢకాయుడు భుజంపై ఒక దుడ్డుకర్ర పెట్టుకుని వేగంగా తమవైపు రావడం చూశారు. అతనికి వెనుక కాస్త దూరంలో మరొక వ్యక్తి కూడా రావటం కంటబడింది. పరుగెత్తడమూ, అరవడమూ

ఎందుకూ పనికిరావని గ్రహించిన మాతృదేవి తటపటాయిస్తూ అక్కడే నిలబడిపోయారు. కొంతసేపటికి ఆ వ్యక్తి మాతృదేవిని సమీపించి "ఏయ్! ఎవరది? ఈ సమయంలో యిక్కడ ఎందుకు నిలబడి ఉన్నావు?" అంటూ గద్దించాడు. మాతృదేవి అతన్ని ఆశ్రయించి, అతణ్ణి తన తండ్రిగా భావించి, "నాన్నా! నాతోపాటు వచ్చినవారంతా ముందుకు వెళ్లిపోయారు. నేను దారి కూడా తప్పిపోయానేమో అనిపిస్తున్నది. నన్ను వారి దగ్గరికి చేరుస్తారు కదా! మీ అల్లుడు దక్షిణేశ్వరంలో రాణీ రాసమణి ఆలయంలో ఉంటున్నారు. నేను ఆయన వద్దకే వెళుతున్నాను. నన్ను అక్కడికి తీసుకెళితే ఆయన ఎంతో సంతోషిస్తారు" అని అన్నారు. ఇలా మాట్లాడుతున్నప్పుడే వెనుకవస్తున్న వ్యక్తి కూడా అక్కడకు వచ్చారు. ఆ వ్యక్తి మగవాడు కాదు. ఒక స్త్రీ. ఆ దృఢకాయుని భార్య అని మాతృదేవి గ్రహించారు. ఒక స్త్రీని చూడగానే మాతృదేవి ధైర్యం పుంజుకొని ఆమె చేతులు పట్టుకొని 'అమ్మా! నేను నీ కుమార్తె శారదను! నాతోపాటు వచ్చిన వారందరూ ముందుగా వెళ్లిపోవడంతో ప్రమాదంలో చిక్కుకొన్నాను. అదృష్టవశాత్తూ నువ్వూ, నాన్నా కనిపించారు. లేకపోతే ఏం చేసేదాన్నో నాకే తెలియదు" అని అన్నారు.

మాతృదేవి సరళత, నిస్సంకోచ వైఖరి, విశ్వాసం, తియ్యని మాటలు ఆ బందిపోటు దంపతులను అమితంగా ఆకట్టుకున్నాయి. కులం, జాతి వంటి సాంఘిక ప్రతిబంధకాలను మరచిపోయి, వారు మాతృదేవిని తమ సొంతకుమార్తెగా భావించి ఊరడించారు. మాతృదేవి అలసిపోయి ఉండటం గమనించి తేలోభేలో గ్రామంలోని ఒక చిన్న దుకాణానికి తీసుకెళ్లి, రాత్రి అక్కడ బస చేయడానికి తగిన ఏర్పాట్లు చేశారు. బందిపోటు భార్య తన వద్దనున్న గుడ్డలను నేలపై పరచి పరుపులా తయారుచేసింది. ఆ బందిపోటు బొరుగులు కొని తెచ్చి తినడానికి ఇచ్చాడు. ఇలా తల్లిదండ్రులలా ప్రేమతో లాలించి, మాతృదేవిని నిద్రపుచ్చి ఆ దంపతులిద్దరూ కాపలాకాస్తూ కూర్చున్నారు. తెల్లవారగానే వారు మాతృదేవిని లేపి సూర్యోదయానికి ముందుగా తారకేశ్వరం చేరుకున్నారు. అక్కడ ఒక చిన్న దుకాణంలో విశ్రమించమన్నారు. ఆ స్త్రీ తన భర్తతో "నా కుమార్తె నిన్న రాత్రి ఏమీ తినలేదు. నువ్వు తారకేశ్వర స్వామిని దర్శించి,





వచ్చేటప్పుడు చేపలూ, కూరగాయలు తీసుకురా! ఈ రోజు ఆమెకు సుష్టుగా తినిపించాలి!" అని చెప్పింది.

ఆ బందిపోటు దొంగ వెళ్లిన కాసేపటికే మాతృదేవితో వచ్చిన వారందరూ ఆమెను వెతుక్కుంటూ అక్కడికి వచ్చారు. సురక్షితంగా మాతృదేవి చేరుకోవడం చూసి వారందరూ ఎంతో సంతోషించారు. అప్పుడు మాతృదేవి తనకు రాత్రి ఆశ్రయమిచ్చిన ఆ "తల్లిదండ్రులను" వారికందరికీ పరిచయం చేస్తూ "వీరు నాకు నిన్న రాత్రి ఆశ్రయం యివ్వకపోతే మాత్రం నా గతి ఏమయి ఉండేదో తెలియదు" అన్నారు. పూజ, వంట, భుజించడం అంతా పూర్తయ్యాక కాసేపు అందరూ విశ్రమించారు. తర్వాత అందరూ వైద్యవాటికి బయలుదేరారు. మాతృదేవి ఆ దంపతులకు తమ కృతజ్ఞతలను చెప్పకుంటూ సెలవు యిప్పించమని అర్థించారు. కాలాంతరంలో మాతృదేవి యిలా అన్నారు "ఒక్క రాత్రిలో మేం ఎంత ఆత్మీయులమైనామంటే వారి నుండి సెలవు తీసుకున్నప్పుడు నా కళ్లలో నీళ్ళు ధారకట్టాయి. అవకాశం చూసుకొని దక్షిణేశ్వరానికి తప్పకుండా రావలసిందిగా వారిని బ్రతిమిలాడాను. అందుకు సమ్మతించిన తర్వాతే, ఎంతో కష్టం మీద నేను బయలుదేరాను. వారు కూడా మాతోపాటు చాలా దూరందాకా వచ్చారు. ఆ స్త్రీ దారిప్రక్కనున్న చేలలోని పచ్చి శెనగలను కోసి నా కొంగుకు ముడికట్టి ఏడుస్తూ నాతో, "శారదా! నా తల్లీ! రాత్రి బొరుగులు తినేటప్పుడు వీటిని కూడా తిను" అని చెప్పింది. ఇచ్చిన మాటను ఆ దంపతులు నిలబెట్టుకున్నారు. నన్ను చూడడానికి పలుమార్లు తీపిపదార్థాలతో దక్షిణేశ్వరానికి వచ్చారు. అన్ని వివరాలు తెలుసుకొని గురుదేవులు కూడా వారు వచ్చినపుడు ఆప్యాయంగా వారిని ఆహ్వానించి ఉపచర్యలు చేసి ఒక అల్లునిలాగే ప్రవర్తించారు. ప్రస్తుతం సామాన్యులూ, మంచివారుగానూ ఉన్న నా బందిపోటు తండ్రి గతంలో ఎన్నో దోపిడీలు చేసి ఉంటాడని అనుకుంటాను".

ప్రేమకు ఉన్న శక్తి అటువంటిది. ప్రేమలో ప్రతిష్ఠితమైన ఒక వ్యక్తి సమక్షంలో వైరుధ్యభావాలు తొలగిపోతాయని యోగసూత్రం వచిస్తుంది. అలాగే ప్రేమస్వరూపిణి అయిన మాతృదేవి సాన్నిధ్యంలో బందిపోట్లు తమ క్రూరత్వాన్ని కోల్పోయి సంస్కారవంతులయ్యారు.

# అనుభవాలు-అనుభూతులూను-8

**- శుకవాణి**

25 ఏళ్ల క్రితం-మచిలీపట్నం-భాస్కరపురం(ప్రసిద్ధ నామం నక్కల తోట)-శ్రీ సాయి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ-సత్యనారాయణగారు, ఇల్లాలు కుమారిగారు ఎంతో శ్రద్ధగా నిర్వహిస్తున్నారు. వందలాదిగా జనం ప్రతిష్ఠకు, భోజనాలకు కూడా వచ్చారు. మధ్యాహ్నం దాటింది, అపరాహ్ణం కూడా చివరికి వచ్చింది. భక్తులంతా వెళ్లిపోయారు. మాలాగా దూరాల నుండీ వచ్చినవారు, కార్యకర్తలు, ఇంటివారు మిగిలారు. ఆనందంగారు, చంద్రన్న అందరూ కునుకుతీస్తున్నారు. అదుగో-అలాటి సమయంలో వచ్చాడు వాడు.

గుండ్రని ముఖం, బూరె బుగ్గలు, చామనఛాయలో కాస్త ముదురు రంగు, చిన్నినోరు, తళతళ మెరిసే గుండ్రని కళ్లు, ఐదేళ్లింకా నిండని బుడతడు-"వీడెవడండీ-నెమలీక మర్చిపోయిన బాలకృష్ణుడిలా ఉన్నాడు!" అనిపించేలా ఉన్నాడు. నెమ్మదిగా మెట్లెక్కి వచ్చి "అన్నం పెడతారాండీ!" అన్నాడు. అప్పుడు చూచాను చేతిలోని సత్తుగిన్నె. "లోపలికి రా, కూర్చో!" అని చెప్పి కుమారిని పిలిచి, "అమ్మా, వాడికి అన్నం పెట్టమ్మా! సాయినాథుడే యీ రూపాన వచ్చి ఉంటాడు" అన్నాను. ఆమె సంతోషంగా ఓ విస్తరివేసి, నీళ్లు పెట్టింది. అన్నం తన గిన్నెలో పెట్టమన్నాడు వాడు. ఎందుకంటే తన అమ్మమ్మకన్నాడు. "నువ్వు ముందు బొజ్జ నిండా తిను. అమ్మమ్మ క్కూడా పెట్టిస్తాంలే!" అన్నాను. కుదురుగా కూర్చొని అన్నం తిన్నాడు. అది కూడా గబగబ కూరుకోవటం కాదు-మెల్లగా ఒక్కో పదార్థపు రుచినీ ఆస్వాదిస్తున్నంత తాపీగా, చక్కగా తిన్నాడు. పులిహోర తింటూ 'ఇది నాకిష్టం' అన్నాడు. వంకాయకూరలో సగం పక్కకుపెట్టి 'నంజుకుంటాను' అన్నాడు. సాంబారు మెల్లగా జుర్రుకుంటూ తిన్నాడు. 'వీడెవడో మంచి పొందికా, తెలివీ ఉన్న కుంకాయి-అనుకున్నాను ముద్దుగా. ఈ లోపల మెల్లమెల్లగా కబుర్లలోకి దింపాను.





"మీ అమ్మమ్మ దగ్గరుంటావా నువ్వు?"

"అవునండీ! ఇంకెవ్వరూ లేరుగా మరి!"

"అమ్మా, నాన్నా?"

"ఎప్పడో సచ్చిపోయారంట-అమ్మమ్మ సెప్పింది.

నా ప్రాణం నీరైనట్లయింది.

"అక్క, చెల్లి ఎవరూ లేరా?"

"పెరుగెయ్యరూ!" అన్నాడు వాడు జవాబు చెప్పకుండా. వేసాను. చక్కగా వంకాయ కూర నంజుకొని తిన్నాడు.

"మీ అమ్మమ్మ ఏం చేస్తుంటుంది? తాత ఉన్నాడా?"

"తాత లేడండీ! అమ్మమ్మేమో నాలుగిళ్లలో పనిజేత్తదండీ! ఆళ్లిచ్చినయ్యన్నీ అదే తినేత్తది. నన్నేమో యాడికన్నా పోయి అడుక్కు తెచ్చుకోమంటుంది".

ఇంతలో కుమారి వాడి గిన్నె నిండా అన్నం, కూరలు పెట్టి తెచ్చి యిచ్చింది. వాడి చేతిలో ఒక అరటిపండు కూడా పెట్టింది. అవి తీసుకొని వాడు "ఇప్పడియ్యి యింటికి తీసుకెల్తానా! ఇందులో అదే సగం తీసేస్కుంటది" అన్నాడు.

"మీ అమ్మమ్మేగా! కాస్త తింటే ఏమిలే!" అన్నాను. నవ్వాడు.

"ఎల్తా" అని లేవబోయాడు.

"ఎండగా ఉందిగా! కాస్సేపు కూర్చో!" అన్నాను. అంతలోనే నా బుర్రలో ఏదో ఆలోచన మెదిలింది. గభాల్న వెళ్లి, అర్ధ నిద్రావస్థలో ఉన్న ఆనందం గారినీ, చంద్రాన్నీ లేపి కూర్చోబెట్టాను. చెరో గ్లాసూ మంచినీళ్లిచ్చి బుడతడి కథంతా చెప్పాను. వాడిని చూపించాను.

"వీడికెవ్వరూ లేరట ఒక్క అమ్మమ్మ తప్ప. ఆవిడ ఎన్నాళ్లుంటుంది-వీడినెలా పెంచుతుంది? పిల్లవాడు తెలివిగానూ ఉన్నాడు-ముద్దుగానూ ఉన్నాడు. మీరు వాళ్ల అమ్మమ్మతో మాట్లాడి రండి. వీడిని మన ఆశ్రమానికి తీసుకువెళదాం" అన్నాను.

"ఆమెకు వీడే ఆసరా గదా! ఇస్తుందా?" చంద్రారెడ్డి అన్నాడు. "కావాలంటే ఆమెకు కూడా ఏదోచోట పని కల్పిద్దాం లేదా ఓపిక లేనప్పడు మన వృద్ధాశ్రమానికే రమ్మందాం. మీరసలు కదలకుండా ఇక్కడే కూర్చొని

చర్చిస్తామంటే ఎలా? బంగారంలాంటి బిడ్డ వీడు. పోనీ ఆ అమ్మమ్మను మీ వెంట తీసుకురండి. గురువుగారే మాట్లాడతారు" అని పోరుబాట పట్టాను. ఈమెతో యుద్ధం కంటే వీధినపడటమే మేలనుకొన్నారేమో ఆనంద చంద్రులిద్దరూ బుడతడిని పిలిచి "మీ యింటికి మేం కూడా వస్తాం పద" అని బయలుదేరారు ఎండలోకి.

నేను నీడ పట్టునే కూర్చొని వాడిని తీసుకువెళ్లాక చెయ్యవలసిన ఏర్పాట్ల గురించీ, పెట్టవలసిన మంచి పేరు గురించీ, కుట్టించవలసిన బట్టలను గురించీ, కొనవలసిన బొమ్మల పుస్తకాలు, రంగు పెన్సిళ్ల గురించీ, వాడికి ఎలాంటి చదువు సరిపోతుందన్న విషయం గురించీ... అలా అలా ఆలోచిస్తూ ఉండిపోయాను. అంతలో కుమారి వచ్చి "మీరు సాయంత్రం బయలుదేరతామన్నారు గదండీ! దారిలో తినడానికి చపాతీ చేయిస్తాను. ఫర్వాలేదా-యింకేమైనా చేయించమంటారా? అని పలకరించడంతో నాకు బుడతడి ధ్యానావస్థ చెదిరింది.

ఈలోపల గురువు గారికి విషయమంతా చెప్పి ఉంచాను. వాడికోసం కూడా రెండు చపాతీలు ఎక్కువ చేయించమని కుమారితో చెప్పాను. దాదాపు గంటన్నర దాటాక వచ్చారు ఆనందం, చంద్రం. ఆశగా వెదికిన నా కళ్లకు బుడతడు కనిపించలేదు. వాళ్లమ్మమ్మ కూడా కన్పించలేదు. "ఇవ్వనన్నదా ముసలామె?" ఆత్రంగా అడిగాను. మంచినీళ్లు కావాలన్న సైగ మాత్రం జవాబైంది. నాలుగు గ్లాసుల నీళ్లు తాగి కొంచెం స్థిమితపడ్డాక వాళ్లు వివరించిన విషయం యిదీ -

బుడతడు మొయ్యలేడేమోనని అన్నం గిన్నె తాను పట్టుకొంటానన్నాడు ఆనందం. ఫర్వాలేదు-తాను మొయ్యగలనన్నాడు వాడు. వాడి నడకవేగం వీళ్లు అందుకోలేకపోతున్నారు. అది చూచివాడు నవ్వి "నేను మెల్లిగా నడుత్తాలే" అని వీళ్ల మీద దయ చూపించాడు. పది నిముషాల నడకలో వాడు వీళ్లకెన్నో కబుర్లు చెప్పాడు. "పందులొత్తున్నాయి-తప్పకోండి-లేప్పోతే బురద చిందుద్ది" అని హెచ్చరించాడు. "ఆ పెద్ద మేడుందే ఆయనకి పిల్లల్లేరు. పిల్లలుంటే ఆయనకస్సలు పడదు. మేం బజార్లో ఆడుకుంటుం టామా-"ఏందిరా ఆ గోల?" అని అరుత్తాడు. రోడ్డు ఆయన్ది కాదు గదా!"





అని విమర్శించాడు. చంద్రం వేసుకొన్న చారల చొక్కా చాలా బాగుందని ఓ అభినందన ఇచ్చాడు. ఆనందంగారిని "నా అంత అబ్బాయిలున్నారా మీకు?" అని ఎంక్వైరీ చేసాడు. మధ్యమధ్య వీళ్లు అడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పాడు చక్కగా. అలాఅలా కొన్ని గుడిసెలున్న వాడలోకి ప్రవేశించారు అందరూ.

"మురుక్కాలవలున్నయ్యండి-జాగర్తగా రండి-మీ గుడ్డలు పాడవుతాయి" అని హితవు చెప్తూ బుడతడు ఓ గుడిసె దగ్గర ఆగి, 'ఒరేయ్! కేశవాయ్!' అని కేకేసాడు. ఎవరో ఆడమనిషి గొంతు లేడని చెప్పింది. 'ఆడు నా ఫెండండీ' అన్నాడు బుడతడు.

"ఒరేయ్! ఇక్కడా అక్కడా ఆగకుండా తిన్నగా మీ యింటికి తీసుకు వెళ్లరా!" అన్నాడు చంద్రం రవంత విసుగ్గా.

"ఇదుగో ఎల్లిపోతున్నాం గదా! ఒక్క నిమిసం ఇప్పడే వత్తా" అంటూ బుడతడు పక్క సందులోంచీ పరుగెత్తాడు-వీళ్లు "మమ్మల్ని రానివ్వరా" అంటున్నా వినిపించుకోకుండా. సరే వీళ్లు కూడా ఆ సందులోకి వెళ్లారు. బుడతడు కనిపించలేదు. వీళ్లు ఐదారు గుడిసెల దగ్గర ఆగి చూచారు. ప్రతి గుడిసెలోనూ ముగ్గురు నలుగురు మనుషులున్నారు. బుడతడింట్లో అమ్మమ్మ తప్ప ఎవ్వరూ ఉండరన్నాడు గదా! వీళ్లు దారినబోయే పిల్లలను ఆపి అడిగారు-చేతిలో అన్నం గిన్నె పట్టుకొని చిన్నపిల్లాడెవరైనా వచ్చాడా-అని. అలా సందు చివరిదాకా వెళ్లిపోయారు. అక్కడ ఒక పిల్ల వీళ్లు అడిగేది విని "ఆడి జుట్టు ఉంగరాలు తిరుగుద్దా?" అని అడిగింది. అవునన గానే "ఆళ్లిల్లు నేను చూపిత్తా రండి" అని దారితీసింది. నడుస్తూ ఆనందం "ఆ బాబు పేరేమిటీ?" అని అడిగాడు.

"అదేనండి-బాబేనండి. కానీ మేమందరం కేటుబాబంటావండి" అన్నది ఆ పిల్ల.

"ఎందుకంటారలా?" అని అడగబోయాడు చంద్రం.

"అదుగో అదేనండి ఆళ్లిల్లు" అంటూనే తుర్రున వెనక్కు పరుగెత్తింది ఆ పిల్ల. సరే-మన వాళ్లు బుడతడి యింటికి చేరారు.

"ఎవరమ్మా లోపల?" అని వీళ్లు కేకేస్తే ఒక గొంతు జవాబిచ్చింది-

"ఎవరు గావాల?" అని. ఆ వెనకనే ఒక అవ్వ బయటికి వచ్చింది. జరిగింది చెప్పారు వీళ్లు. వచ్చిన పని కూడా చెప్పారు. అవ్వ సావధానంగా అంతా విన్నది.

"బాబూ, లోపలికి వత్తారా!" అంటూనే దారితీసింది. వీళ్లు కూడా వెళ్లారు. మంచం మీద ఒక ఆడమనిషి, ప్రక్కనే పొత్తిళ్లలో పసిబిడ్డ నిద్రలో ఉన్నారు. చెంగున లోపలికి వచ్చింది రెండేళ్ల ఆడపిల్ల. అవ్వ వీళ్ల కోసం చెక్క బల్ల లాగి కూర్చోమంది.

మంచంవైపు చూపిస్తూ అవ్వ "నా కోడలయ్యా! బాబుగాడి తల్లి" అన్నది. రెండేళ్ల పిల్ల, పొత్తిళ్లలో పిల్లాడూ వాడి చెల్లీ తమ్ముడూనట. బాబు తండ్రి రిక్షా తొక్కుతాడు. తల్లి కూలి చేస్తుంది. అవ్వ పిల్లల్ని కనిపెట్టుకొని ఉంటుంది. "ఇంతకీ బాబేడీ?" ఆనందం అడిగితే అవ్వబోసి నోరంతా విప్పి నవ్వింది. వేలితో మూలకు చూపించింది. అక్కడ ఒక బట్టల కుప్ప ఉంది. అయోమయంగా చూచారు వీళ్లు. అవ్వ వాటి కింద ఉన్నాడని సైగ చేసింది. మన వాళ్లకు ఒళ్లుమండింది. వెళ్లి ఆ బట్టలు లాగేసి, వాటి క్రింద ఉన్న బాబుగాణ్ని బయటికి తీసారు. వాడి చెవి పట్టుకొని -

"ఏరా, అబద్ధాలు చెప్తావా?" అన్నాడు చంద్రం కళ్లెర్రజేసి. "అయ్య బాబోయ్ నొప్పండీ, వదలండీ!" అన్నాడు బాబు గుంజుకొంటూ.

"వదలకండి బాబూ! లచ్చసార్లు చెప్పాను అట్టా యిల్లెంట ఎల్లి అడుక్కో గూడదూ-అబద్ధాలు సెప్పకూడదూ అని. ఎక్కడెక్కడికో ఎల్లిపోతాడు. ఏదేదో సెపుతాడు. ఆళ్ల నాన్న కొట్టినా సరే యీడు లొంగడు" అన్నది.

బాబుగాడు చెవి వదిలించుకొని "ఊళ్లో అందరూ ఎళ్లారు గదా-నేనెల్తే తిడతావేం?" అని అరిచాడు అవ్వ వైపు తిరిగి.

"మంది పురిటిల్లు రా ఎదవా! మైలబడ్డోళ్లు దేవుఁడి దగ్గరికెల్తారంట్రా?" అవ్వ కోపంగా అంది.

"వచ్చావు సరేరా! అలా అమ్మా, నాన్నా లేరు-దిక్కు లేరు- అని అబద్ధాలెందుకు చెప్పావు?" చంద్రం అడిగాడు.

"అట్టంటే ఎక్కువబెడతారు" - అన్నాడు వాడు మెల్లగా.

ఆనందానికి వాడి ధైర్యం నచ్చింది. కానీ "తప్పరా బాబూ! అలా చెప్తే





పైన దేవతలు తథాఽస్తు అంటారట. అంటే మనం చెప్పినవే నిజమైపోతాయన్నమాట. ఎంత తప్పో చూచావా?" అని వివరించాడు. వెంటనే బాబుగాడు చెంపలు గట్టిగా వాయించుకొని "అమ్మబాబో-యింకెప్పడూ అట్టా సెప్పనండీ" అంటూనే పరుగెత్తుకు వెళ్లి మంచం మీద ఉన్న వాళ్లమ్మ పక్కన కూర్చొన్నాడు-అనుకొని మరీ! మన వాళ్లకు గుండె కరిగినట్లైంది. అవ్వ చేతిలో ఓ వంద రూపాయలు పెట్టి, పిల్లలకేమన్నా కొనమని చెప్పి వచ్చేసారు. వాళ్లు వచ్చేస్తోంటే బాబుగాడు లేచి వచ్చి "ఆనందం చెయ్యి పట్టుకొని కోపమొచ్చిదాండీ!" అని మళ్లీ చెంపలేసుకున్నాడు. వీళ్లు నవ్వి వాడి వీపు తట్టి వచ్చేసారు. అదీ సంగతి.

ఆనందం, చంద్రం కాళ్లు చాపుకొని కూర్చున్నారు-పాపం ఎండనబడి తిరిగొచ్చారుగా! నాకు కన్నీళ్లు వస్తున్నాయి. పిల్లవాడు రాలేదని కాదు. నేను వాడి మాటలు నమ్మి మోసపోయానే అనీ కాదు. ఇంతటి తెలివితేటలు, లోకనైజాన్ని చదవగల తీక్ష్ణ దృష్టీ, వాక్చాతుర్యం, చక్కని రూపం-యివన్నీ ఏమవుతాయి? వాడిని ఎటు నడుపుతాయి? మంచి శిక్షణలో వజ్రంగా రూపొందగిన యోగ్యత ఉండి కూడా-బ్రతుకుపోరాటంలో శుద్ధ లౌకికుడిగా, అవకాశవాదిగా, నైతిక విలువలు లేనట్లు తయారవుతాడా-లేక ఏ దైవమైనా కరుణించి జాతి రత్నమవుతాడా?

"అక్కయ్యా, ఇంకా వాడి గురించే ఆలోచిస్తున్నారా? మీ మంచి మనసుకు లోకమంతా సత్యంగానే కన్పిస్తుందిగానీ, చూసారుగా-వేలెడంత లేనివాళ్లు గూడా ఎంతెంత నేరుస్తున్నారో యివ్వాళా, రేపూ" అన్నాడు చంద్రం. కళ్లు తుడుచుకొన్నాను. నేను మళ్లీ బందరు వెళ్లలేదు. వాడిని మాత్రం మరచిపోలేదు. వాడు యోగ్యుడై దేశానికి పనికొచ్చే మేధావి కావాలని మనసారా కోరుకొంటూనే ఉంటానిప్పటికీ.

ఎటొచ్చీ చంద్రం మాత్రం నేనేదైనా "ఫలానా చోట అనాథ పిల్లలున్నారట!" అనగానే "బందరు సరుకు కాదు గదా!" అంటాడు నవ్వుతూ. బందరులో బంగారు కోటింగ్ మాయ బంగారు నగలు ఎక్కువగా తయారవుతాయని అతనికి చెప్పినది కూడా నేనే మరి!



# శ్రీ గజానన విజయం

- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు

(గత సంచిక తరువాయి)

ఇక్కడ ఇంకో భక్తుడు బాలకృష్ణ కథ కూడా ఉంది. అతడు సమర్థ రామదాసస్వామి భక్తుడు. అతని భార్య పుతలీబాయి కూడా గొప్ప భక్తురాలే, వారిరువురూ ప్రతి సంవత్సరమూ ఆనవాయితీగా సజ్జనగఢ్ యాత్రకు వెళుతూ ఉండేవాళ్ళు. అది గూడా కాలినడకన. తమ సామాను మోయటానికి ఒక పొట్టి గుర్రాన్ని అద్దెకు తీసుకొని ప్రయాణం చేసేవాళ్ళు. ఇంతకీ వారి సామాను ఎంత? వంట పాత్రలు, ఒక అతుకులు పడ్డ గొంగళి, చేతికఱ్ఱ, శ్రీరామదాస స్వామి రచించిన గొప్ప ప్రబోధాత్మక గ్రంథం 'దాసబోధ'. బాలకృష్ణుడు నిరాడంబర భక్తుడు, నిరహంకారి. ప్రయాణ సమయంలో ఎడనెడ భిక్షాటనం చేసి ఆ వచ్చిన పదార్థాలతో వంట చేసి దాన్ని శ్రీరాముల వారికి నివేదన పెట్టి ఆ ప్రసాదాన్నే భార్యతో భుజిస్తూ ఉండేవాడు. బాలకృష్ణుడు దారి పొడుగునా చిరుతలు వాయిస్తూ సంకీర్తన చేస్తూ ఉంటే ఆయన భార్య కూడా దానికి అనుగుణంగా ఇత్తడి తాళాలు మ్రోగిస్తూ వంత కలిపేది. వారు సజ్జనగఢ్, ఖమ్‌గాంవ్, మెహెకర్, దేవల్‌గాంవ్ రాజ్యాలు దర్శించుకుంటూ జాల్నా చేరి అక్కడ ఆనందస్వామి ఆలయంలో అర్చన చేసేవారు. అక్కడ నుండి రామదాసస్వామి వారి జన్మ స్థలమైన జాంబు వెళ్ళి ఆ పవిత్ర ప్రదేశంలో మూడు రోజులు గడిపేవారు. అక్కడ నుండి బయలుదేరి అనేక పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ పండరీపురంలో పాండురంగ విఠలును సేవించి క్రమంగా మాఘ బహుళ నవమి నాటికి సజ్జనగఢ్ చేరుకొనేవారు. అక్కడ తమకు చేతనైనంతగా బ్రాహ్మణ సంతర్పణ చేసేవాళ్ళు. బాలకృష్ణ నిజమైన రామదాసి. అలాంటి భక్తులు చాలా అరుదు. అక్కడ మూడు రోజుల సేవా కార్యక్రమాల తరువాత





వారు తిరుగు ప్రయాణం ప్రారంభించేవారు. ఈ విధంగా ప్రతి సంవత్సరం జీరు పోకుండా జరుగుతూ ఉండేది. ఇప్పడాతని వయస్సు అరవై. మాఘ బహుళ ద్వాదశినాడు బాలకృష్ణ స్వామి సమర్థుల వారి సమాధి చెంత నీరు నిండిన కళ్ళతో కూర్చొని ఉన్నాడు. "స్వామీ! ఇక మీదట తమ దర్శనానికి యీ విధంగా కాలినడకన రాలేకపోవచ్చు. ఏదైనా వాహనం ఆసరాతోనైనా రాగలనో లేదో. తల్లీ! నీకు తెలుసు గదా ఈ శరీరం దుర్బల మౌతున్నది" అంటూ దీనంగా తన అశక్తతను విన్నవించుకున్నాడు. మనసులో యీ భావాలు మెదులుతుండగానే అతడు నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారుఝామున ఒక ఆనందకరమైన కలగన్నాడు. సమర్థుల వారు కన్పించి "నాయనా! బాలకృష్ణా! ఇక మీదట నీవు సజ్జనగఢ్‌కు రావలసిన అవసరం లేదు. మాఘ బహుళ నవమినాడు బాలాపూర్‌లోనే నా సేవలు ప్రారంభించు. నేనే అక్కడికి వస్తాను". ఈ వాగ్దానం వింటూనే బాలకృష్ణకు పట్టలేనంత ఆనందం కలిగింది. ఆ సంతోషం మోసుకుంటూ భార్యాసహితుడై తన ఊరికి తిరిగి వచ్చాడు.

మరుసటి సంవత్సరం బాలకృష్ణ తన ఇంటి వద్దనే మాఘ బహుళ పాడ్యమి నాటి నుండీ ఉత్సవాలు ప్రారంభించాడు. ప్రతి దినము సమర్థ రామదాస స్వామివారు వ్రాసిన 'దాస బోధ' పారాయణలు, పూజలు, రాత్రిళ్ళు సంకీర్తనా కాలక్షేపాలు, మధ్యాహ్న సమయాల్లో బ్రాహ్మణులకు సంతర్పణలు, సాయంత్రాలు ఆరాత్రిక పఠనాలు జరుగుతూ ఉండేవి. బాలాపూర్ నివాసులంతా యీ కార్యక్రమాలకు తమకు తోచినంత ఆర్థిక సహాయం చేస్తూ భజనల్లో, పూజల్లో పాల్గొంటున్నారు. తొమ్మిదవ రోజు వచ్చింది. రాముల వారికి అభిషేకం చేస్తున్నారు. హఠాత్తుగా గజానన మహారాజులవారు బాలకృష్ణుని ఇంటి వాకిట కన్పించారు. అందరూ ఆశ్చర్య సంభ్రమాలలో మునిగిపోయారు. మహారాజులవారి ఆగమన వార్త విని బాలకృష్ణ ఎంతో ఆనందించాడు. అతడు మనసులో యిలా అనుకుంటు

న్నాడు "నేను సమర్థుల వారి రాకకోసం ఎదురుచూస్తున్నాను. వారు యీ నవమినాడు యిక్కడకు వస్తానని వాగ్దానం చేశారు కదా!" అదే సమయంలో గజాననులు ఒక పాట పాడటం ప్రారంభించారు.

"శ్రీరాముడు తన పాదస్పర్శతో రాతిని
నాతిగ చేశాడు. అహల్యకు దివ్యత్వమునే ఇచ్చాడు"

హృదయాన్ని తాకే యీ పలుకులు వింటూనే బాలకృష్ణుడు వాకిలిదాకా పరుగెత్తుకొని వచ్చాడు. స్వామి వారి దివ్యరూపాన్ని దర్శిస్తూ మోకరిల్లి నమస్కారం చేశాడు. కాని అద్భుతం అక్కడ ఒక చేతిలో దండము, జడలు కట్టిన పొడవైన కేశ సంపద వ్రేలాడుతున్న దృఢమైన స్కంధ భాగము, విభూతి రేఖలతో వెలుగుతున్న ఫాలభాగము, కాషాయ కౌపీనము ధరించిన సమర్థ రామదాసస్వామి కన్పించారు. తన ఇంటి వాకిట సమర్థుల వారి దర్శనం కావటంతో బాలకృష్ణుడు యింతింత అనరాని ఆనందంలో మునిగిపోయారు. కనుల నుండి ఆనందబాష్పాలు ధారగా కారసాగాయి. ఒకసారి ఆ రూపం మాయమై గజాననుల వారి రూపం కనిపించింది, మళ్ళీ అది అదృశ్యమై సమర్థుల వారు కనిపించారు. ఆ వెంటనే మళ్ళీ గజాననులు, ఈ విధంగా - చలనచిత్రపు తెర మీద మాదిరిగా వారొకసారి, వీరొకసారి ఆ మహాత్ములిద్దరూ కన్పిస్తూ, మాయమౌతూ ఉండేసరికి బాలకృష్ణుని నోట మాట రావట్లేదు. అప్పుడు గజాననులు యిలా అన్నారు. "ఓ బాలకృష్ణా! ఆశ్చర్యపడవద్దు, నీవు ఆరాధించే సజ్జనగఢ రామదాస స్వామిని నేనే సుమా! మాఘ నవమి నాడు నేనే నీ దగ్గరకు వస్తానని వరమిచ్చాను గదా! ఇదిగో వచ్చాను చూడు. ప్రస్తుతం నేను షేగాఁవ్‌లో ఉంటున్నాను. నీవు లోనున్న ఆత్మను మరచి, పై ఆకారాన్ని మాత్రమే గుర్తిస్తున్నావేల? భగవద్గీతలో నీవు చదవలేదా?

"వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోऽపరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ॥ -2.22





జనులు జీర్ణమైన వస్త్రాలను విడిచివేసి నూతన వస్త్రాలు ధరించినట్లుగానే జీవుడు శిథిలమైన శరీరాన్ని వదిలివేసి నూతన శరీరాన్ని ధరిస్తాడు.

"రా! రా! నన్ను ఆసీనుడిని చేయి" అంటూ గజాననులు బాలకృష్ణ వెంట ఇంటి లోపలికి నడిచారు. అక్కడ ఒక విశాలమైన చెక్క బల్ల మీద కూర్చున్నారు. గజానన మహారాజుల వారు బాలాపూర్‌కు విచ్చేసినట్లు ఆ ఊరి ప్రజలందరికీ తెలిసింది. తండోపతండాలుగా వారంతా బాలకృష్ణ ఇంటికి పరుగెత్తుకు రాసాగారు. తాను సన్మానిస్తున్నది గజానన మహారాజుల వారినా లేక సమర్థ రామదాసుల వారినా? అన్న సందిగ్ధావస్థలో బాలకృష్ణ కొట్టుమిట్టాడుతున్నాడు. సూర్యాస్తమయమైంది. నలుదిక్కుల చీకట్లు వ్యాపించి బాగా పొద్దుపోయింది. అందరూ నిద్రకు ఉపక్రమించారు. బాలకృష్ణకు మళ్ళీ కల వచ్చింది. ఆ కలలో సమర్థుల వారు చెబుతున్నారు - నా నూతన ఆకారం ప్రస్తుతం విదర్భ ప్రాంతంలోని షేగాఁవ్‌లో నివసిస్తున్న గజాననులే. నన్ను సేవించినట్లే భక్తి శ్రద్ధలతో వారిని గూడా సేవించు". ఆ అర్థరాత్రి బాలకృష్ణకు మెలకువ వచ్చింది. వెంటనే వాళ్ళు గజాననుల పాదాల మీద పడ్డాడు. "స్వామీ! మీ వాగ్దానం నెరవేరింది. ఈ నవమినాటి ఉత్సవాలు నేననుకొన్నట్లుగానే మీ దయ వలన నెరవేర్చ గలిగాను. ఈ దీనుణ్ణి కరుణించి యిక్కడే కొన్ని వాళ్ళు తమరు ఉండిపోవాలని నా విన్నపం" అని ప్రాధేయపడ్డారు.

"అలాగే, కాన్ని కొన్ని రోజుల తరువాత మళ్ళీ బాలాపూర్ వస్తాను" అని మాట ఇచ్చి ఉదయకాలపు ఆహారం స్వీకరించిన తరువాత షేగాఁవ్ వెళ్ళారు. మరుక్షణంలోనే షేగాఁవ్‌లో ప్రత్యక్షమయ్యారు. దారిలో వారు ఎవ్వరికీ కన్పించలేదు.

దాసుగణు విరచితమైన యీ గ్రంథం భక్తులకు శుభముల నొసగు గాక!

**(సశేషం)**

ఓం శ్రీ సాయిరాం



# షిరిడీ డైరీ

– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే
అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

06-02-1912

నేను లేచి కాకడ హారతికి వెళ్లాను. మాధవరావు దేశ్‌పాండే యివ్వేళ నాకు అనుమతి దొరకవచ్చునన్నాడు. అందుచేత నేను అతనితోను, బామన్‌గాఁవ్‌కర్ తోనుకలిసి ఉదయం 7-30కి సాయిసాహెబ్ దగ్గరికి వెళ్లాను. తిరిగి సాయంత్రం రమ్మన్నారు. అందుచేత మేము వచ్చి మా పనిలో పడిపోయాం. నేను, ఉపాసనీ, జోగ్ పంచదశి చదువుకున్నాం. బయటికి వెళ్లేటప్పుడు సాయిదర్శనం చేసుకున్నాం. మధ్యాహ్నహారతికి వెళ్లాం. బ్రహ్మానందబాయి ఒక హారతి, కొన్ని పాటలు పాడింది. బాపు సాహెబ్ జోగ్ తన పెన్షన్‌కోసం ఇవ్వేళ కోపర్‌గావ్ వెళ్లారు. అందుచేత హారతి తొందరగా ముగిసింది. భోజనానంతరం నేను, భామన్ గాఁవ్‌కర్ కలిసి మసీదుకి వెళ్లాం. అక్కడ కాకాసాహెబ్ దీక్షిత్ ఉన్నారు. సాయిసాహెబ్ "మీరు మరునాడు వెళ్ళవచ్చున"న్నారు. మాధవరావ్ కూడా వచ్చాడక్కడికి.

సాయిసాహెబ్ చాలాకాలంగా రాత్రింబవళ్లు విపరీతంగా ఆలోచిస్తున్నామన్నారు. అందరూ దొంగలే. కాని వాళ్లతోనే కలిసుండాలి. వారిని బాగు చేయమని లేదా తీసివేయమని తాము రేబవళ్లు భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. కానీ ఆయన యీ అభిప్రాయాన్ని అంగీకరించి తమ ప్రార్థన మన్నించటం లేదెందుకో- అన్నారు. తాము మరో నెల, రెండు నెలలు





వేచి ఉండి చూస్తామనీ, కాని తమ ప్రార్థన తాము ఉండగానో, పోయాకనో తప్పక నెరవేరుతుందనీ అన్నారు. తామిక మీదట తెలకలతని దగ్గరకుగాని, వ్యాపారి దగ్గరకుగాని వెళ్లి భిక్ష తీసుకోమన్నారు. మనుషులు మంచివాళ్లు, భక్తులు కారు. వాళ్ల మనసులు స్థిరంగా ఉండవు. "కొద్దిమంది మిత్రులు మాత్రం ఒకచోట కలుస్తారు. దివ్యజ్ఞానం గురించి మాట్లాడతారు, కూర్చొని ఆత్మవిచారణ చేస్తారు" అన్నారు తమకు కొన్ని వేల రూపాయలు కావాలన్నారు కూడా. ఏ సందర్భంలో అన్నారో మర్చిపోయాను. నేను తిరిగి వచ్చాను. దీక్షిత్ రామాయణం పారాయణ జరిగింది.

అటుపైన బాబా నడకకు వెళ్లినపుడు ఆయన్ని చూచాను. ఉత్సాహంగా ఉన్నారు. ఇవ్వేళ రాజరామ్‌పంత్ దీక్షిత్ ఖాండవాకు వెళ్లి పోయాడు. ఉపాసనీ భార్య చనిపోయింది. ఈ విషాదవార్త ఉత్తరం ద్వారా వచ్చింది. నేను మాధవరావ్‌దీక్షిత్ ఉపాసనీ దగ్గరకు వెళ్లి ఓదార్చి వాడాకు తీసుకొని వచ్చాము. నేను వెళ్లే విషయం ఫకీరుబాబా సాయిబాబాని అడిగారట. బాబా నేను రేపు వెడతా నన్నానని చెప్పారట. ఇదే విషయం నా భార్య అడిగితే "అతను నన్ను వ్యక్తిగతంగా అనుమతి అడగలేదు, నేనేమీ చెప్పను" అన్నారట. ఆ వెంటనే నేను అక్కడికి వెళ్లాను. అప్పుడు సాయిబాబా నేను దాదాభట్ దగ్గర ఐదు వందలు, మరెవరి దగ్గరైనా రెండువందలు తీసుకొని ఆ మొత్తం తనకివ్వనిదే నేను వెళ్లలేనని అన్నారు. బాపు సాహెబ్ కోపర్‌గాఁవ్ నుంచి తిరిగిరావటం కొద్దిగా ఆలస్యం అయినందు వలన వాడా హారతి కూడా కొంచెం ఆలస్యమయింది. బ్రహ్మానంద బాయి, శివానంద శాస్త్రి కూడా భజనలు చెప్పారు.

07-02-1912

నేను పెందలకడ లేచి ప్రార్థనానంతరం మామూలుగా పంచదశి క్లాసుకి

వెళ్లాను. ప్రయాణానుమతికోసం సాయినాథుని దగ్గరికి వెళ్లలేదు. బయటికి వెళ్లడం, తిరిగిరావడం చూచి మసీదు దర్శనానికి వెళ్లాను. సాయిమహరాజ్ మసీదు ముందర కూర్చొని ఎవరో ఒకతను కోతులనాడిస్తుంటే చూస్తున్నారు. అక్కడ వృత్తిపరంగా గాయని, నాట్యగత్తె అయినామె ఒకామె ఉంది. ఆమెకు మంచి గొంతుంది, ఆధ్యాత్మిక గీతాలు పాడింది. ఆ తర్వాత బ్రహ్మానందబాయి, ఆమె సహచరి సాలుబాయి, శివానందశాస్త్రి వచ్చారు. వారు పూజ చేశారు. బ్రహ్మానందబాయి (ఈమెనే మాయిసాహెబ్ అంటారు) చాలా చక్కగా పాడింది. సాయిసాహెబ్ సింహాసనం వగైరాలు ఏర్పాటు చేయమన్నారు. అంతా ఏర్పాటయ్యాక మేము మా స్థానాల్లో నిలబడ్డాం. మాయిసాహెబ్ మళ్లీ రెండు పాటలు పాడింది.

మేము మంత్రముగ్ధులమయి నిలబడిపోయాం. సాయిబాబా కూడా ఆ పాటలిష్టపడ్డారనుకుంటాను. తర్వాత మేము మామూలుగా హారతిచ్చి మధ్యాహ్నభోజనానికి వెళ్లిపోయాం. మాయిసాహెబ్, ఆమె సహచరులందరూ మా విడిదిలోనే భోజనం చేశారు. తరువాత బామన్‌గావ్‌కర్, మాయిసాహెబ్, తమ మనుషులు అందరూ సాయిసాహెబ్ దగ్గర తిరుగుప్రయాణానికి అనుమతి కోసం వెళ్లారు. మాయిసాహెబ్, సాలుబాయి అనుమతిపొంది బండిలో వెళ్లిపోయారు. శివానందశాస్త్రి, బామన్‌గావ్‌కర్‌లను సాయిబాబా ఆపేశారు. నేను పడుకొని ఓ మంచి కునుకు తీశాను. తర్వాత దీక్షిత్ రామాయణం చదివాడు. అటుపై నేనొక్కడినే దాసబోధ చదువుకున్నాను. సాయం వాహ్యాళిలో సాయిదర్శనం కలిగింది. వాడా హారతి తర్వాత శేజారతికి వెళ్లాను. రాత్రి భీష్మ భాగవతం, దీక్షిత్ రామాయణం చదివారు.

(సశేషం)





# మనిషెంత నీచుడో!

(ఇది మన దేశంలో జరగలేదు. కానీ సార్వజనీనమైన సందేశం యిస్తుంది.)


ఒక పెద్దమనిషి ఓ చిన్న హొటలు యాజమాన్యానికి ఒక ఉత్తరం వ్రాసాడు. "నాకు మీ నగరానికి వచ్చే పని ఉంది. నాలుగు రోజులు మీ హొటల్లో బస చేస్తాను. నా కుక్కను కూడా తీసుకురావచ్చునా? అది చాలా మంచిది. ఎవ్వర్నీ యిబ్బందిపెట్టను. మీకేం అభ్యంతరం ఉండదు గదా?"

హొటలు యజమాని మంచి తెలివిగలవాడూ, రవ్వంత కొంటె వాడూను. వెంటనే యిలా జవాబు వ్రాసాడు -

"నేనీ హొటలు చాలా సంవత్సరాలుగా నడుపుతున్నాను. ఇన్నేళ్లలో ఒక్క కుక్క కూడా నా హొటల్లో తువ్వాళ్లుగానీ, దుప్పట్లుగానీ, వెండి చెంచాలు, ప్లేట్లుగానీ, గోడలకు తగిలించి ఉంచిన చిత్రపటాలుగానీ ఎత్తుకుపోలేదు. అర్ధరాత్రి తాగి వచ్చి గందరగోళం చేసి యితరులకు యిబ్బంది కలిగిస్తే ఏ కుక్కనుగానీ నేను మెడ బట్టి బయటకు గెంట వలసిన అవసరం కలగలేదు. అంతే కాదండోయ్-ఒక్క కుక్కయినా నాకు బిల్లు చెల్లించకుండా పారిపోలేదు.

పై కారణాలన్నింటిచేతా మీరు మీ కుక్కను తెచ్చుకోవడానికి నాకెటు వంటి అభ్యంతరమూ లేదు. ఎటొచ్చీ దాని హామీ మీద మీరిక్కడ ఎంతకాలం బస చేసినా సంతోషమే. ఇద్దరికీ మా స్వాగతం!

**వైశాఖ పూర్ణిమ బుద్ధజయంతి సందర్భంగా పాఠకులందరికీ సాయివాణి శుభాకాంక్షలు. బుద్ధదేవుని బోధలు చిరస్థాయిగా వర్ధిల్లుగాక!**



# మంగళాశీస్సులు



శ్రీ బోయపాటి కోటయ్యగారు ఆశ్రమానికి అభిమాని. నెలకోసారైనా ఆశ్రమ దర్శనం చేస్తుంటారు. వారు, వారి శ్రీమతి వినోదగారు తమ ఏకైక పుత్రుడు **చి॥ లీలాకృష్ణ** వివాహం **చి॥సౌ॥ ఇంద్రాణితో '15-ఏప్రిల్-10వ తేదీ** ఉదయం గం.10.28 ని.లకు అల్కాపురిలోని స్వాగత్‌గ్రాండ్ హొటల్‌లో కన్నులపండువుగా నిర్వహించారు. వధూవరులిద్దరూ పరస్పర అవగాహనతో కలసిమెలసి దాంపత్య ధర్మాలైన గురుజన సేవ, సంతానాన్ని సత్వౌరులుగా తీర్చిదిద్దడం లోకకళ్యాణం అన్న వాటిని చక్కగా నెరవేర్చి ధన్యులు కావలసిందిగా పరమపూజ్య గురుదేవుల దివ్యాశీస్సులు.

శ్రీ శ్రీరాంప్రసాద్, శ్రీమతి రేవతి దంపతులు సాయిధామానికి అభిమానులు. మంచి దాతృత్వబుద్ధి ఉన్నవారు. సాయిభక్తులు. మీదు మిక్కిలి నిరాడంబర మనస్కులు. వారు తమ జ్యేష్ఠపుత్రిక **చి॥సౌ॥ అనూషకు చి॥ మోనీష్‌తో ఏప్రిల్-10వ తేదీ** ఉదయం 10 గం.52 ని.లకు-కొంపల్లెలోని సిద్ధ్ కన్వెన్షన్ సెంటర్‌లో కళ్యాణక్రతువు నయనానంద కరంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా వైవాహిక బంధంతో జీవితాలు ముడివేసుకున్న యీ వధూవరులు పరస్పరం సదవగాహనతో, సౌమనస్యంతో కలకాలం జీవించి, అతిథి అభ్యాగత ఆదరణ, గురుజన సేవ, సమాజ స్పృహ-అన్న దాంపత్య ధర్మాలతో గడుపుతూ, తమ సంతతిని దేశమాత గర్వపడదగ్గ రీతిలో పెంచి ధన్యజీవనులు కావల సిందిగా పరమపూజ్య గురుదేవులు మంగళాశీస్సులు అందిస్తున్నారు.

శ్రీమతి రత్నమ్మగారు పుష్కరంపాటు స్వార్థరహితంగా సాయి






ధామానికి సేవ చేసి, యీ ఛాయలోనే కడపటి క్షణాలు గడిపేసిన ధన్యజీవి. ఆమె రెండవ కుమారుడు అశోక్‌కుమార్, కోడలు లత. వారి పిల్లలు హరీష్, సురేశ్‌లిద్దరూ శ్రీ సాయి విద్యాధామంలోనే బాల్యం నుంచీ చదువుకున్నారు. వాళ్లలో **చి॥ హరీష్ వివాహం చి॥సౌ॥ ప్రియాంకతో ఏప్రిల్ 23వ తేదీ (2015)న** ఉదయం గం.10.40 ని.లకు తొర్రూరు గ్రామంలోని కళ్యాణమంటపంలో శాస్త్రోక్తంగా జరిగింది. ఉన్నత విద్యా వంతులైన యీ వధూవరులు పరస్పర స్నేహానురాగాలతో జీవించి, సత్సంతతిని పొంది, వారిని లోకకళ్యాణకారకులుగా తీర్చిదిద్దాలని పరమపూజ్య గురుదేవులు తమ ప్రేమాశీస్సులు అందిస్తున్నారు.

"దర్శనమ్" పత్రిక సంపాదకులు శ్రీ మరుమాముల వేంకట రమణ శర్మగారు తమ పుత్రులు **చి॥ శ్రీరామ సిద్ధార్థ శర్మకు 23 ఏప్రిల్ 2015న ఉదయం గం.10.56 ని.లకు** శ్రీరామ సిద్ధాంతి భనం (నేరేడ్‌మెట్)లో ఉపనయన మహోత్సవం నిర్వహించారు. ఆ క్షణాన ఉపనీతుడైన వటువు గాయత్రీ ప్రసన్నుడై, తేజోమూర్తిగా వర్ధిల్లి, లోకకళ్యాణకారకుడై నిలవాలని పరమపూజ్య గురుదేవులు తమ దివ్యాశీస్సులను అందజేస్తున్నారు. శుభం భూయాత్.

ఆశ్రమానికి చిరకాల అభిమానులు భవానిపుర వాస్తవ్యులు శ్రీమతి చంద్రావతి, శ్రీ గున్నేశ్వరరావు. వారు తమ కనిష్ఠ పుత్రుడు **చి॥ గిరిధర్‌కు చి॥సౌ॥ స్పందనప్రియతో** పాణిగ్రహణ మహోత్సవాన్ని **ఏప్రిల్ 22వ తేదీన** విజయనగరంలో రమణీయంగా నిర్వహించారు. ఈ నవదంపతులు కొంగులేగాక మనసులు కూడా ముడివేసుకొని కన్నవారికీ, మాతృ భూమికీ కూడా వన్నె తేగల సత్సంతానవంతులై కలకాలం జీవింతురు గాక! - అని పరమపూజ్య గురుదేవుల ప్రేమాశీరక్షతలు.

# శుకవాణి



- మాతా శుకవాణి

"కామోత్కంఠత గోపికల్, భయమునం గంసుండు, వైర క్రియా
సామగ్రిన్ శిశుపాల ముఖ్య నృపతుల్, సంబంధులై వృష్ణులన్
బ్రేమన్ మీరలు, భక్తి నేము నిదె చక్రింగంటి మెట్లైన ను
ద్దామ ధ్యాన గరిష్ఠుడైన హరిఁజెందన్ వచ్చు ధాత్రీశ్వరా!"

అలుకనైన, చెలిమినైనఁ గామంబుననైన బాంధవముననైన భీతి
నైనఁ దగిలి తలప నఖిలాత్ముడగు హరిఁ జేరవచ్చు, వేరుసేయడతడు".

ధర్మరాజు చేసిన రాజసూయాగాంతంలో తొలి తాంబూలం కురు వృద్ధుడైన భీష్మాచారుడిని విడిచి శ్రీకృష్ణునికివ్వటం పట్ల శిశుపాలుడు క్రోధా విష్టుడయ్యాడు. శ్రీహరిని నోటికి వచ్చినట్లు నిందించి సభా మర్యాదనే గాక బంధుమర్యాదను కూడా దాటి, ఏకంగా దైవధిక్కారమే చేసాడు. తన మేనత్తా, శిశుపాలుని తల్లీ అయిన సాత్వతికిచ్చిన మాటకు కట్టుబడి అతడు చేసిన నూరు తప్పలను గతంలో సహించి ఉన్న కృష్ణుడు-శిశు పాలుని ధూర్తత్వానికిక స్వస్తి పలకదలచుకొని సుదర్శనంతో అతని శిరస్సు ఖండించాడు. వెంటనే అతని శరీరం నుండి ఒక జ్యోతి వెలువడి శ్రీహరిలో లీనమైంది. అది చూచి చకితుడైన ధర్మరాజు నారదుని "పరమదుష్టుడైన శిశుపాలుడు బ్రహ్మైక్యం కావటం ఎలా సంభవం? దీని వెనుక గల రహస్యం ఏమిటి స్వామీ?" అని ప్రశ్నించాడు. అందుకాయన చెప్పిన జవాబులో కొన్ని మాటలివి.

-"గోపికలు శ్రీకృష్ణునికి సన్నిహితులు కావాలన్న కోరికతో సంచరించారు. కంసుడు ఎక్కడ అతడు వచ్చి తనను చంపుతాడోనన్న భయంతో





క్షణక్షణం అతడినే సంస్మరిస్తూ గడిపాడు. శిశుపాలాదులు స్వామి ఔన్నత్యాన్ని గుర్తించలేక వైరులై ఆయననే నిత్యమూ స్మరిస్తూ, ఆయనను ఎలా ఓడించాలా అని ధ్యానిస్తూ గడిపారు. యాదవులు బాంధవ్యంతో కృష్ణుని సదా ప్రేమించారు. మీరు (పాండవులు) ప్రేమతో ఆయనకు చేరువయ్యారు. మేము (నారదాదులు) భక్తితో ఆయనను భజిస్తాము. కోపంతోనైనా, స్నేహంతోనైనా, కోరికతోనైనా, బంధుత్వంతో, భయంతో - ఏ మార్గంలోనైనా సరే ఆ సర్వేశ్వరుడైన విష్ణువును చేరుకోగలం. ఏ ఒక్కరినీ కాదని దూరంగా నెట్టడు పరమాత్ముడు". అటుపైన ఆయన జయ విజయుల గాథ వివరంగా చెప్పాడు.

అందుచేత - ఇష్టాననో, కష్టాననో, స్వార్థంతోనో, త్యాగబుద్ధితోనో, తాదాత్మ్యంతోనో-ఏదో ఒక రకంగా భగవద్ధ్యానం చేసినవాడు ఆయనను చేరి తీరతాడు. మధురభక్తి ఎంతటిదో వైరభక్తీ అంతటిదే-అంటారు పోతన్న.

# మాతృసంస్థ కబుర్లు

ఏప్రిల్ 12వ తేదీన కోదండ రామ సాయి సన్నిధానంలో శ్రీ సీతారామ కళ్యాణానికి పదహారు రోజుల పండుగ జరిగింది. గత పదిహేను రోజులు కూడా ఉదయ వేళలలో పూజలు, సాయంత్రాలలో భజనలు సలక్షణంగా జరుపుకొని 12వ తేదీన సామూహిక పూజలు, ప్రసాదవినిమయాలతో ముగించుకున్నారు భక్తులంతా. పదవ తరగతి పిల్లల పరీక్షల హడావుడి, స్కూలు పిల్లల పరీక్షల ప్రహసనం (ప్రసహసనం అంటే హాస్యనాటిక). ఆరవ తరగతి నుండీ 9వ తరగతి వరకు ఆ పేపర్లు సెట్ చేసినవారు తాము ఏ వయసు వారి కోసం చేసారో మర్చిపోయారో-లేక పై వారి ఆదేశాలే అలా ఏడ్చాయో తెలియదుగానీ టీ తయారుచేసే విధానం గురించీ, చపాతీకి కావలసిన వస్తువుల గురించీ హైస్కూలు పిల్లలను

అడిగారు. ఇంగ్లీషులోనేమో ఓ పే....ద్ద లకోటా కథ ఇచ్చి దానిని సమ్మరైజ్ (సంగ్రహంగా) చెయ్యమన్నారు. సైన్సు, లెక్కలు, ఫిజిక్సు-ప్రతిదీ ఒక హాస్య ప్రబంధం, లేదా అయోమయమైన గల్ల నుడికట్టూ (ప్రహేళిక)ను- పిల్లవాడి వయసెంత-మనం యీ ఇంగ్లీషు టెక్స్ట్ పెట్టి-తెలుగుమీడియంకీ, ఇంగ్లీష్ మీడియంకీ కామన్ చేసి ఎన్నేళ్లయింది-ఒక పాసేజ్ చదివి, అర్థం చేసుకొని, అవగాహన చేసుకోవడానికి ఎంత టైమ్ పడుతుంది?- స్వయంగా ఒక పాత్ర శీల స్వభావాలను చిత్రించాలంటే దానికి కావలసిన వాక్యనిర్మాణం కూర్చుకొంటూ వెళ్లాలంటే ఎంత సమయం కావాలి?- ఇవేవీ దొరతనంలో ఉన్న పుణ్యపురుషులకు పట్టవు. ఏవో అచ్చుకొట్టి పిల్ల వెధవల మొహాన్న కొడితే-వాళ్లేదో గిలికి టీచర్ల నెత్తిన కొడితే (మధ్యలో పరీక్ష హాళ్లలో సార్లే ఆన్సర్లు డిక్టేట్ చేసే ఉత్తమ ప్రభువు. ప్రభుత్వ పాఠశాలల అద్భుత విన్యాసాల క్యూడా తక్కువేం ఉండదు), ఆ పేపర్లలో నల్లక్షరం కనపడిన భాగ్యానికే మురిసిపోయి టీచర్లు మార్కులు వేయవలసిన దుస్థిస్లితి-అసలు మార్కులెన్నయినా ఫర్వాలేదు పై తరగతికి నెట్టవలసిన గతి-ఇదంతా పెద్ద ప్రహసనం గాక మరేమిటో చెప్పండి! అయ్యా, అదిగో ఆ ప్రహసనం రాష్ట్రమంతటా ముగిసినట్లే మాకూ ముగిసింది-11వ తేదీతో-అటుపైన 23 వరకు క్లాసులు నడపాలనీ వెనుకబడిన వారిని ముందుకు నడపాలనీ పెద్ద తలకాయల నుంచీ తాఖీదు. మరి, ఆ సమయంలో ఉత్తమ విద్యా ర్థుల గతేమిటి? వాళ్లెంత "బోర్" ఫీలవుతారు? అంచేత -

11-22 పదకొండు రోజులపాటు చక్కని శిక్షణ శిబిరంలాగా నడిచింది మా సాయి విద్యాధామం. కథలు, చర్చలు, దేశభక్తుల గాథలు, శ్లోకాలు, పద్యాలు, పాటలు, నాటికలు, కోలాటాలు-అన్నిటినీ మించి యోగాభ్యాసం మొదలైన వాటితో పదకొండు రోజులూ పదకొండు నిమిషాల్లాగా గడిపేసారు అభ్యాసకులు. ఉపాధ్యాయులందరూ కూడా ఎంతో సహనంతో చక్కగా అందరికీ నేర్పారు. ప్రాథమిక తరగతుల వారు ఏప్రిల్ 22వ తేదీన, ఉన్నత తరగతుల వారు 23న వారు నేర్చినవి ప్రదర్శించి తల్లిదండ్రులను అలరించారు. 23వ తేదీతో పాఠశాల పని రోజులు ముగిసాయి. ఇక యీ ఏటికి చేతులు కడుక్కున్నాం.





# వివాహ వ్యవస్థ

- ప.పూ. శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ

అత్యంత ప్రాచీనకాలంలో మనుషులు కూడా పశువుల మాదిరిగానే అనాగరికంగా, వికృతంగా ప్రవర్తించేవారు. అప్పట్లో భార్యాభర్తల అనుబంధాలు ఉండేవి కావు. సమయం వచ్చినపుడు జతకట్టడం, ఆ తర్వాత ఎవరికివారే విడిపోవడం జరుగుతూ ఉండేది. క్రమంగా మానవుని బుద్ధి వికసించడం ప్రారంభించి అనురాగాలు కూడా ఏర్పడుతూ వచ్చాయి. దానితో స్త్రీ, పురుషుల మధ్య అనుబంధాలు కూడా పెరుగుతూ వచ్చాయి. పురుషుడు తన సహచరి అయిన స్త్రీకి రక్షణగా నిలబడుతూ వచ్చాడు. తల్లులకు తమ బిడ్డల మీద వాత్సల్యం ఎక్కువ. దానితో కాలక్రమేణా కుటుంబవ్యవస్థ వేర్లు తన్నుకోవడం ప్రారంభించింది.

మేధావులూ, తపోసంపన్నులూ అయిన ఋషులు, నైతికతను జోడించి యీ వ్యవస్థకు నియమ నిబద్ధతను ఏర్పాటు చేశారు. అదే వివాహ వ్యవస్థ. జాతిలో సంస్కృతి వృద్ధి చెందుతున్న కొద్దీ కొన్ని కొన్ని పద్ధతులు యీ వివాహ వ్యవస్థలో చోటు చేసుకుంటూ వచ్చాయి. స్త్రీ, పురుషులు తోచినప్ప డల్లా తమకు నచ్చిన వాళ్లతో జతకూడడం పశుతత్వం కావడం వలన-మానవత్వానికి అనుగుణంగా నియమనిష్ఠలను యీ వివాహ వ్యవస్థకు అనుసంధానం చేశారు. గృహస్థ ఆశ్రమధర్మాలను ప్రవేశపెట్టారు. స్త్రీ, పురుషులు వివాహానంతరం ఒకరి మీద ఒకరు ఆధారపడుతూ ప్రేమాభిమానాలతో జీవిస్తామని వివాహ సమయంలో ప్రమాణం చేస్తారు- ధర్మేచ, అర్థేచ, కామేచ, నాతి చరామి అంటూ. అంతేగాక అగ్నిసాక్షిగా ఏడుసార్లు ప్రదక్షిణలు చేయిస్తూ సుఖమైన సంసారం కోసం ఏడు ప్రమాణాలు (సప్తపది) చేస్తారు. ఈ వివాహ

బంధానికి గుర్తుగా మట్టెలు, మంగళసూత్రం స్త్రీకి ధరింపజేస్తారు. హిందువైన పురుషునికి ఉపనయన సమయంలో యజ్ఞోపవీతంలో ఒక్క ముడితో ఉన్న మూడు పోగుల ఉంటాయి. వివాహ సమయంలో వివాహితుడనేందుకు గుర్తుగా మరి రెండు ముడులతో ఇంకో ఆరు పోగులను ధరింపజేస్తారు. వీటన్నింటినీ వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. (కాలక్రమంలో కొన్ని జాతుల వారు ఉపనయ నానికి దూరమైనారుగానీ ఆ హక్కు అన్ని జాతులకూ-స్త్రీలతో సహా ఉన్నది)

వివాహ సమయంలో వరుడు "మూడు ముడులు వేసి కట్టే మాంగల్యం ఒక ఆభరణంంగా మాత్రమేగాక, స్త్రీ యొక్క ఆరోగ్యానికి కూడా ఉపకరిస్తున్నదని శాస్త్రజ్ఞులు చెబుతారు. ఇంతేగాక సామాజికంగా కూడా దీనికి ఒక ప్రాముఖ్యత ఉన్నది. అవివాహిత కనిపించినపుడు ఏ పురుషుడైనా ఆమెను యిష్టపడినపుడు తనను వివాహమాడమని కోరవచ్చును. ఇది ధర్మమే. (అంతవరకే ధర్మం. బలవంతంగా సొంతం చేసుకోవాలనుకోవటం రాక్షసత్వం. మానవధర్మం కాదు.) కాని ఒక మగనాలి ఎదురుపడినపుడు ఆమెను తల్లిగానే భావించాలి. (మాతృవత్ పర దారేషు) మరి ఆమె వివాహిత అని. ఎలా తెలుస్తుంది? మట్టెలు, మంగళసూత్రం ద్వారా. కాబట్టి సమాజంలో ధర్మపాలన జరగాలంటే వివాహిత స్త్రీకి మంగళసూత్రం తప్పనిసరి. ఈ సదాచారాలను పాటించకుండా ఒక మగవాడితో సహజీవనం చేసే స్త్రీని సమాజం మగనాలిగా గౌరవించదు. ఉంపుడుకత్తెగానే భావిస్తుంది.

వివాహం అయిన స్త్రీ మూడు సందర్భాలలో మాత్రమే మంగళసూత్రం తీసేస్తుంది. 1) పూర్ణ వైరాగ్యం కలిగి సంసారాన్ని త్యజించి, సన్న్యాసం స్వీకరించేటప్పడు, 2) తాళి కట్టిన భర్త మరణించి, తను విధవ అయినపుడు, 3) తన భర్త నచ్చక అతనితో తెగతెంపులు చేసుకుంటూ, యికపై నీ దారి నీది, నా దారి నాది అని అంటూ ఇంకొకరితో సహజీవనం చేయడానికి సిద్ధపడినపుడున్నూ. విదేశీయ మతస్థులకు యీ వివాహ సంస్కృతి తెలియదు. మరి యిప్పడు తమిళనాడులో కొందరు వివాహిత





స్త్రీలు తమ మంగళసూత్రాలను తెంచి మొగుడి చేతిలో పెట్టారట. వీళ్లు పైన పేర్కొన్న వాటిలో ఏ తరగతికి చెందుతారో! ఇంతటి అవివేకం అయిన పనికి వీళ్లను ప్రోత్సహించిన సంస్థలు ఏవో, వాళ్ల ఉద్దేశ్యం ఏమై ఉంటుందో-అత్యున్నతమైన భారతీయ సంస్కృతికి వీళ్లు ఎందుకు వ్యతిరేకంగా పనిచేయాలని ప్రయత్నిస్తున్నారో లోతుగా విచారించాల్సి ఉన్నది.

భారతదేశాన్ని సంస్కృతిని ఏకసూత్రతతో యిన్ని యుగాలుగా పట్టి ఉంచినది వివాహ వ్యవస్థే. "మేం మొగుడూ పెళ్లాలమోచ్" అని పెళ్లిళ్ల రిజిస్ట్రారిచ్చిన సర్టిఫికెట్ మెడకు తగిలించుకొని తిరగటం కన్నా మంగళ సూత్రం మేలు కాదా? ఆడది చల్లగా ఉండి, ప్రేమబంధంతో భర్తను బంధించి ప్రోత్సహించినంత కాలమే మగవాడి ముందడుగు. అందుకే వాడు "మాంగల్యం తంతునానేన మమ జీవన హేతునా" అని మరీ మాంగల్యం కడతాడు తప్ప- అదేదో ఆవు మెడలో పలుపుతాడు వంటిదని భావించడం వెర్రీ-పైత్యమున్నూ.

ఇప్పడు తమిళనాడులో కొందరు దంపతులు అమాయకంగానో, ప్రలోభాలకు లొంగిపోవటంవల్లనో మంగళసూత్రాలను తెంచుకోవటమనే వికృతమైన (సంస్కృతికి వ్యతిరేకం) పనులకు సిద్ధపడటమేగాక, తగుదు నమ్మా అని ఫొటోలకు పోజులివ్వటం కూడా యీ వెర్రి తాలూకే.

మహాభాగవతంలో పరమశివుడు హాలాహల భక్షణ చేసిన సందర్భంగా పార్వతి ఆయన త్యాగాన్ని అంగీకరించటం గురించి చెప్తూ శుకమహర్షి యిలా అంటాడు-

"మ్రింగెడివాడు విభుండని, మ్రింగెడిదియు గరళమని మేలని ప్రజకున్

మ్రింగుమనె సర్వమంగళ, మంగళసూత్రంబునెంతమది నమ్మినదో!'

అంటాడు. అనాదికాలంగా ఉన్న మాంగళ్యం గూర్చిన ప్రసక్తి మన గ్రంథాలలో ఎక్కడా లేదనేంత తెంపరితనం వీరికెక్కడిదో! 'ఈ విషబీజం మహావృక్షం కాకముందే హిందువులు వారికి తగు పాఠం నేర్పవలసి ఉన్నది.

# స్వరాంజలి

– శ్రీ మధురాపంతుల రాజగోపాలరావు

అడుగులు నావైతే
నడకలు నీవే సాయీ
చేతులు నావైతే
వ్రాతలు నీవోయీ ॥
చలనం నాదైతే సాయీ
చాలన శక్తి నీదోయీ
చింతయే నా నైజం
స్థిరతయే నీ రూపం సాయీ ॥
భీతియే నా రీతి - మరి
నిర్భీకతే నీ పేరు సాయీ
కాంక్షల పేటిక నేను
నిష్కామపు తీరం నీవూ
గెలుపోటముల పోరాటంలో
విజేతను చేయవో ఓ సాయీ ॥ సా ॥
మడమ త్రిప్పని పరుగులో
మునుముందు నడువుమో సాయీ
గోతిలో పడుతున్న నన్ను
చేయంది శిఖరాన నిలుపవోయీ ॥
ఎగిరి విరిగే అలను నేనైతే
లోతులందని కడలివి నీవోయీ
మినుకు మినుకుమనే మిణుగురు నేనైతే
మింట మెరిసే మార్తాండుడ వీవోయీ
స్మరియించుటె గోపాలునివంతు
తరింపజేయుట నీ వంతోయీ ॥ ॥ సా ॥





# ఆంజనేయా, నమోస్తుతే!

– శ్రీ జయంతి సత్యనారాయణ (భద్రం)

అంజనీ పుత్రుడవు, అకళంక చరితుడవు, ఆపదోద్ధారకుడవు, ఆత్మబంధుడవీవు
అమిత బలవంతుడవు, ఆదిత్య శిష్యుడవు, అన్ని శాస్త్రంబుల...పండితుడవు నీవు
నరులలో, సురలలో, నీ సాటి లేరెవరు, వానరులందున మేటి వానరుడవీవు
ధర్మదీక్షాపరుడవు, దుర్నిరీక్ష్యుడవీవు, అభయమొసంగుమా మాకు ఆంజనేయా॥

రామలక్ష్మణుల వనమున తొలుత జూచితీవు, ప్రియముగా పలికి వారల మనముల గెలిచితీవు,
రాముని సుగ్రీవునకు మిత్రుగా జేసితీవు, రామకార్యంబుకై శపథమొనరించితీవు,
వాలి మరణమున, సుగ్రీవు రాజుగా జేసితీవు, అంగదునకు యౌవరాజ్య మిప్పించితీవు,
సూర్యసుతునకు, ప్రియసచివుండవీవు, సూర్య శిష్యా, అందుకొనుము, స్తుతులు నీకు,
అన్ని దిక్కుల సీతకై వానరులు వెదుకబోగా, అంగదుని వెంట దక్షిణదిశ కరిగితీవు,
అంతులేని సాగరమ్మెటుల దాటుటయంచు, కలతజెందిన కపుల చింతదీర్ప
జాంబవంతుని పిలుపుచే జవము(జూపి, జలధి లంఘింప సిద్ధపడితివీవు,
ఆపదలందు ఆదుకొను బాంధవుడవీవు, అందుకొనుమా హనుమా అంజలిదిగో॥
సాగరమ్ము నవలీలగ దాటితీవు, లంకజేరి సీతమ్మను జూచితీవు
ముద్రికనిచ్చి, ముదమును గూర్చితీవు, చూచి రమ్మనగ లంకను గాల్చితీవు
రక్కసుల జంపి, రావణు దర్పమడచి, రామకార్యము సఫలము జేసితీవు
సుందరుడవు, సుందరకాండ నాయకుడవీవు, అందుకొనుమా అంజలి ఆంజనేయా॥

**(సశేషం)**